

భారత్ బంద్‌కు కార్మిక సంక్షేమ సంఘం మద్దతు

షాద్‌నగర్, ఫిబ్రవరి 15 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నేడు (శుక్రవారం) భారత్ బంద్‌కు కార్మిక సంక్షేమ సంఘం సంపూర్ణ మద్దతునిస్తోందని ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ తెలిపారు. గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కనీస మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కేంద్రం చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బంటారం సుధాకర్‌గౌడ్, రాజేష్, అశోక్‌రెడ్డి, అంజయ్యయాదవ్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అవిశ్వాస తీర్మానం వీగిపోనుందా!

- మున్సిపల్ చైర్‌పర్సన్ వైపు తిరిగిన ఇద్దరు కౌన్సిలర్లు
- దీంతో మారిన సమీకరణాలు
- నేడు ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతిపై అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు





ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం, (ఇన్‌సెట్‌లో), చైర్‌పర్సన్ స్రవంతి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 15: ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి (కాంగ్రెస్)పై పెట్టిన అవిశ్వాసం వీగిపోనుందా..! ముందుగా అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా సంతకాలు చేసిన కొందరు సభ్యులు ఆ తర్వాత మనసు మార్చుకున్నారా.. వారిప్పుడు చైర్‌పర్సన్‌కు మద్దతు తెలిపేందుకు నిర్ణయించుకున్నారా.. అంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది. ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి (కాంగ్రెస్)పై కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి నోటీసులు ఇచ్చారు. దీనిపై శుక్రవారం (నేడు) ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఓటింగ్ నిర్వహించేందుకు ఇబ్రహీంపట్నం ఆర్డీవో, ప్రిసైడింగ్ అధికారి కె.అనంతరెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాట్లు చేశారు. ఉదయం 11 గంటలకు అవిశ్వాస తీర్మానంపై సమావేశం జరుగనుంది. అయితే, అవిశ్వాస తీర్మానానికి తగినంత సంఖ్యాబలం లేని కారణంగా ఈ అవిశ్వాసం వీగిపోయే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇక్కడ మున్సిపాలిటీలో మొత్తం 24మంది సభ్యులున్నారు. ఎక్స్ అఫిషియో సభ్యుడిగా స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తన పేరు నమోదు చేసుకోవడంతో సభ్యుల సంఖ్య 25కు పెరిగింది. అయితే, అవిశ్వాసం నెగ్గాలంటే మూడింట రెండొంతులు అంటే 17 మంది సభ్యులు చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా ఓటేయాల్సి ఉంది. కాగా చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రతిపై సంతకాలు చేసిన వారిలో 15 మంది బీఆర్ఎస్, ఇద్దరు బీజేపీ సభ్యులున్నారు. నెల రోజులుగా ఈ సభ్యులు క్యాంపులో ఉన్నారు. కాగా ఇద్దరు కౌన్సిలర్లు క్యాంపును వీడి చైర్‌పర్సన్ వైపు వచ్చినట్టు తెలిసింది. దీంతో అవిశ్వాస తీర్మానానికి కావాల్సినంత సంఖ్యాబలం ఉండడం లేదు. దీంతో అవిశ్వాసం వీగిపోయే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. అయితే, అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించేందుకు ఇప్పటికే అధికార యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసింది. మున్సిపల్ కార్యాలయం వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

హస్తం గూటికి సునీతా రెడ్డి

- సునీతారెడ్డితో పాటు ఆమె కుమారుడు రినీష్‌రెడ్డి
- మధ్యాహ్నం 12 గంటలకు ముహూర్తం
- తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ నిర్ణయం
- ఉమ్మడి జిల్లా నుంచి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, అనుచరులు భారీగా తరలి రావాలని పిలుపు



నేడు గాంధీభవన్‌లో దీపాదాస్ మున్షీ ఆధ్వర్యంలో చేరిక

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రాజకీయ పరిణామాలు రోజురోజుకూ మారుతున్నాయి. జిల్లాలో బీఆర్ఎస్ ఆధిపత్యాన్ని దెబ్బకొట్టేందుకు పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రయోగాలు ఫలితాలు చూపుతున్నాయి. వికారాబాద్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి కుటుంబం బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోకి రావాలని నిర్ణయించుకోవడంతో కాంగ్రెస్‌లో ఉత్సాహాన్ని రేపుతోంది. ఇందులో భాగంగానే శుక్రవారం పట్నం మహేందర్‌రెడ్డి సతీమణి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, వారి కుమారుడు రినీష్‌రెడ్డిలతో పాటు భారీగా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. వారు భారీ ర్యాలీగా వెళ్లి గాంధీభవన్‌లో రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్/ వికారాబాద్ ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ సీట్లే లక్ష్యంగా తెలంగాణ కాంగ్రెస్ పావులు కదుపుతోంది. కీలకమైన చేవెళ్ల స్థానం నుంచి బలమైన అభ్యర్థిని దింపాలని కసరత్తు చేస్తోంది. అయితే అందుకు తగ్గట్టే మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి ఫ్యామిలీకే టికెట్ కేటాయించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. పట్నం మహేందర్‌రెడ్డి, ఆయన సతీమణి వికారాబాద్ జడ్పీ చైర్మన్ సునీతారెడ్డి ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఇందులో భాగంగా వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ముహూర్తం ఖరారైంది. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు తన కుమారుడు పట్నం రినీష్ రెడ్డి, పలువురు పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి గాంధీ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆమె కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. గురువారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు సునీతారెడ్డి ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రం పునఃనిర్మాణం కోసం సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు సునీతారెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు. పట్నం కుటుంబం అభిమానులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయం మేరకు కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆమె వెల్లడించారు. సునీతారెడ్డి, రినీష్‌రెడ్డితో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి తమ అభిమానులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు చెబుతున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటల వరకు పలువురు బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తమ నివాసానికి తరలి రావాలని ఆమె పిలుపునిచ్చారు. తమ ఇంటినుంచి గాంధీభవన్ వరకు కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు సునీతారెడ్డి ప్రకటించారు.

నాడు శత్రువులు... నేడు మిత్రులు

రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరని అంటారు. వికారాబాద్ జిల్లా రాజకీయాల్లో నిప్పు, ఉప్పుగా ఉన్న రేవంత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి కుటుంబాలు ఇపుడు ఏకం కావడం విశేషం. 2018 ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఓటమే ధ్యేయంగా బీఆర్ఎస్ అధిష్ఠానం అప్పటి మంత్రి పట్నం మహేందర్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించింది.

అప్పుడు ఆయన తన సోదరుడు పట్నం నరేందర్ రెడ్డిని కొడంగల్ నుంచి రంగంలోకి దింపి.. తన అనుభవాన్ని, అధికారాన్ని ఉపయోగించి రేవంత్‌రెడ్డిని సొంత నియోజకవర్గంలో తొలిసారి ఓటమి పాలు చేశారు. ఆ తర్వాత రేవంత్‌రెడ్డి మల్కాజిగిరి ఎంపీగా గెలవడం, పీసీసీ అధ్యక్షుడి పదవి పొందడంతో పాటు ఒంటి చేత్తో శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకు రావడం జరిగింది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్‌లో తిరిగి రేవంత్‌రెడ్డితో తలపడిన మహేందర్‌రెడ్డి సోదరుడు నరేందర్‌రెడ్డి ఓటమి పాలయ్యారు. ఇప్పుడు అదే రేవంత్‌రెడ్డి సమక్షంలో పట్నం మహేందర్‌రెడ్డి దంపతులు కాంగ్రెస్‌లో చేరనుండటం విశేషం.

చేవెళ్ల ఎంపీ టికెట్ ఖరారు?

వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి చేవెళ్ల ఎంపీ టికెట్ ఆశిస్తున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతోనే వారు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పార్టీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. తాండూరు ఎమ్మెల్యే టికెట్ మహేందర్‌రెడ్డి ఆశించగా మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డికి బీఆర్ఎస్ కేటాయించింది. దీంతో పాటు మరో నేత మెతుకు ఆనంద్‌తో నెలకొన్న విభేదాల కారణంగానే మహేందర్‌రెడ్డి దంపతులు బీఆర్ఎస్‌ను వీడుతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా చేవెళ్ల ఎంపీ టికెట్‌పై మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఆశలు పెట్టుకున్నారు. తనకు ఎంపీ టికెట్ వస్తుందనే నమ్మకంతో ఉన్నారు. టికెట్ కోసం గట్టి ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది.

హ్యాట్రిక్ జడ్పీ చైర్‌పర్సన్.. పదేళ్లకు బీఆర్ఎస్‌కు గుడ్ బై..!

సునీతారెడ్డి హ్యాట్రిక్ జడ్పీ చైర్‌పర్సన్‌గా ఘనత సాధించారు. రెండు పర్యాయాలు ఉమ్మడి రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వహించిన సునీతారెడ్డి ప్రస్తుతం వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. మూడుసార్లు జడ్పీ చైర్‌పర్సన్‌గా చేసిన ఘనత సునీతారెడ్డికే దక్కింది. 2006లో టీడీపీలో చేరి రాజకీయ రంగ ప్రవేశం చేసిన సునీతారెడ్డి ఆ ఏడాదిలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీగా విజయం సాధించి జడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. 2011లో రెండోసారి జడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన ఆమె 2014 ఎన్నికలకు ముందు తన భర్త పట్నం మహేందర్‌రెడ్డితో పాటు ఆయన సోదరుడు పట్నం నరేందర్ రెడ్డి తదితరులు టీడీపీకి రాజీనామా చేసి కేసీఆర్ సమక్షంలో టీఆర్ఎస్ (బీఆర్ఎస్)లో చేరారు. ఇదిలా ఉంటే, రెండేళ్ల కిందట మర్పల్లి మండలం పట్లూరులో స్వంత పార్టీ నాయకులే తన వాహనాన్ని అడ్డుకుని వీరంగం సృష్టించిన ఘటనపై అధిష్ఠానం స్పందించక పోవడం పట్ల ఆమె తీవ్ర ఆవేదనకు గురయ్యారు, అప్పటి మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పట్నం మహేందర్‌రెడ్డి, సునీతారెడ్డి, నరేందర్‌రెడ్డి, అప్పటి వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ తదితరులను హైదరాబాద్‌కు పిలిపించి వారి మధ్య సయోధ్య కుదిర్చేందుకు ప్రయత్నించినా ఆమె తన అసంతృప్తిని వెళ్లగక్కారు. అప్పటి నుంచి చాలావరకు ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలకు దూరం ఉంటూ వచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆమె పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం చేయకుండా దూరంగా ఉన్నారు. కొంతకాలంగా మహేందర్‌రెడ్డి దంపతులు కాంగ్రెస్ పార్టీలో చేరతారనే ప్రచారం జరిగింది. చివరకు శుక్రవారం సునీతారెడ్డి, ఆమె కుమారుడు రినీష్‌రెడ్డి తమ అభిమానులు, వెంట వచ్చే నాయకులు, కార్యకర్తలతో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. సునీతారెడ్డి రెండు పర్యాయాలు టీడీపీ నుంచి జడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నిక కాగా, మూడోసారి బీఆర్ఎస్ నుంచి ప్రాతినిధ్యం వహించారు. కాగా, దశాబ్ద కాలం పాటు బీఆర్ఎస్ పార్టీలో కొనసాగిన సునీతారెడ్డి ఎట్టకేలకు ఆ పార్టీకి గుడ్ బై చెప్పి కాంగ్రెస్ గూటికి చేరనున్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్
- బీజేపీలో చేరిన చేవెళ్ల ఎంపీపీ విజయలక్ష్మీ రమణారెడ్డి దంపతులు



ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరుతున్న చేవెళ్ల ఎంపీపీ రమణారెడ్డి దంపతులు

చేవెళ్ల, ఫిబ్రవరి 15 : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ముందుకు సాగాలని ఆ పార్టీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. చేవెళ్ల ఎంపీపీ మల్గారి విజయలక్ష్మీ రమణారెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు గురువారం చేవెళ్లలో బీజేపీలో చేరారు. చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి తదితరుల సమక్షంలో వారు బీజేపీ కండువా కప్పుకున్నారు. అంతకుముందు చేవెళ్ల పట్టణ కేంద్రంలో బీజేపీ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఈటల మాట్లాడుతూ ప్రపంచలోనే అతి శక్తివంతమైన నాయకుడు ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. అభివృద్ధి చెందిన దేశాలన్నీ భారత్ వైపు చూస్తున్నాయన్నారు. పదేళ్లలో దేశంలో అవినీతి రహిత పాలన అందిస్తూ బీజేపీ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అన్ని మతాలను మెప్పించి అయోధ్యలో రామమందిరం నిర్మించి 140 కోట్ల మంది భారతీయులకు అంకితం చేసిన ఘనత ప్రధానికే దక్కుతుందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలో 400 ఎంపీ సీట్లు బీజేపీ టార్గెట్ అని అన్నారు. తెలంగాణలో 17 ఎంపీ సీట్లు గెలిచే విధంగా ప్రతీ కార్యకర్త పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు సైతం బీజేపీ పార్టీకి ఓటు వేస్తామని చెబుతున్నారని తెలిపారు. చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసే నాయకుడని ఈటల కొనియాడారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయవాదంతో బీజేపీ ముందుకు సాగుతుందన్నారు. అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రధాని ఇటీవల తెలంగాణకు రూ.9వేల కోట్లు అప్పు ఆర్బీఐ ద్వారా ఇప్పించారని గుర్తుచేశారు.

బీజేపీలో భారీగా చేరికలు

చేవెళ్ల ఎంపీపీ మల్గారి విజయలక్ష్మీ రమణారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేతలు భారీగా బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో మాజీ ఎంపీపీ విజయ్ భాస్కర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శివానందం, డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ మాణిక్యరెడ్డిలతో పాటు వివిధ గ్రామాలకు చెందిన వందలాదిమంది బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఈటల సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, జిల్లా నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాందేవ్‌రెడ్డి, జంగారెడ్డి, విఠల్‌రెడ్డి, గోపాల్ రెడ్డి, శ్రీనివాస్, మండలాధ్యక్షుడు పాండురంగారెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, మండల సీనియర్ నాయకుడు శర్వలింగం తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

స్వామివారి కల్యాణం.. కమనీయం

- శెట్టిపల్లిలో కనుల పండువగా శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం
- పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు
- భక్తులకు అన్నదానం

ఆమనగల్లు , ఫిబ్రవరి 15: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా ఖ్యాతి గాంచిన ఆమనగల్లు మండలం శెట్టిపల్లిలో గురువారం శ్రీ అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా నిర్వహించిన కల్యాణోత్సవానికి ఆమనగల్లు, మాడ్గుల, కందుకూరు, యాచారం, ఇబ్రహీంపట్నం, కడ్తాల, కల్వకుర్తి, తలకొండపల్లి మండలాలతో పాటు హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి వారి మూలవిరాట్లను ఆలయం నుంచి కల్యాణ మండపానికి స్థానిక మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవిసత్యం, ఆలయ చైర్మన్ సింగిని శ్రీనివాస్, ఆలయ మేనేజింగ్ ట్రస్టీ కోట్ల జగన్మోహన్, అర్చకులు మెశ్లారి నవీన్ శర్మ, గూడ కృష్ణమాచార్యులు పూర్ణకుంభంతో తీసుకువచ్చారు. శెట్టిపల్లి మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం దంపతుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అనురాధ పత్యానాయక్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నిట్ట నారాయణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోనుగోటి అర్జున్‌రావు, ఆమనగల్లు మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, నాయకులు లక్ష్మణ్‌రావు, చింతల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారిణులు

రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీ ప్రారంభం

- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- మూడు రోజుల పాటు నిర్వహణ

ఆమనగల్లు, ఫిబ్రవరి 15 : ఆమనగల్లు మండలంలోని శెట్టిపల్లి గ్రామంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను గురువారం పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, క్రీడాకారులతో కలిసి తాజా మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం ప్రారంభించారు. వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 3వ ఓపెన్ టు ఆల్ వాలీబాల్ పోటీలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 35 టీంలు హాజరయ్యాయి. ప్రజాప్రతినిధులు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అదేవిధంగా కల్వకుర్తి బీసీ గురుకుల పాఠశాల, బాలనగర్ ఎస్టీ గురుకుల పాఠశాల, పడకల్, చంద్రధన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులచే మార్చ్ పాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ విజేతలకు ప్రథమ బహుమతి రూ.20,116, ద్వితీయ బహుమతి రూ.10,116, తృతీయ బహుమతి రూ.5,116తో పాటు షీల్డ్‌లను అందిస్తామని తెలిపారు. పీఈటీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెరువుల ఆక్రమణలపై ఫిర్యాదు

- పరిశీలించిన కమిషన్ సభ్యులు

గచ్చిబౌలి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): చెరువులు అన్యాక్రాంతమవుతున్నాయని ఫిర్యాదులు రావడంతో హైకోర్టు నియమించిన కమిషన్ సభ్యులు గురువారం శేరిలింగంపల్లి మండలంలోని మాదాపూర్ దుర్గం చెరువు, గుట్టల బేగంపేటలోని సున్నంచెరువు, నానక్‌రాం గూడలోని మేడికుంట, గౌలిదొడ్డిలోని గోసాయికుంట, నల్లగండ్లలోని పెద్ద చెరువు, చందానగర్‌లోని గంగారం పెద్ద చెరువులను పరిశీలించారు. త్వరలోనే హైకోర్టుకు నివేదిక సమర్పిస్తామని వారు తెలిపారు. వీరి వెంట సర్వే అండ్ ల్యాండ్ రికార్డు అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ రాములు, రాజేంద్రనగర్ మండల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేస్ వెంకటేష్, డిప్యూటీ తహసీల్దార్ శంకర్, జీహెచ్ఎంసీ, నీటిపారుదల శాఖ అధికారులు వంశీకృష్ణ, నళిని, బాల్‌రెడ్డి, మాదాపూర్, గచ్చిబౌలి, చందానగర్ పోలీస్ స్టేషన్లకు చెందిన అధికారులు ఉన్నారు. శేరిలింగంపల్లి, మేడ్చల్, మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో చెరువులు అన్యాక్రాంతమవుతున్నాయని ఫిర్యాదులు రావడంతో హైకోర్టు చీఫ్ జస్టిస్, హైకోర్టు న్యాయవాది ప్రవీణ్‌కుమార్, పీపీ శ్రీకాంత్‌రెడ్డితో కమిషన్‌ను ఏర్పాటు చేశారు.



దుర్గం చెరువును పరిశీలిస్తున్న కమిషన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు

ముందుచూపుతోనే మంచి భవిష్యత్తు

చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య దామోదర్



సావనీర్‌ను విడుదల చేస్తున్న ఉపకులపతి దామోదర్, తదితరులు

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 15 : విద్యార్థులు ముందు చూపుతో కష్టపడి చదివితేనే భవిష్యత్తులో మంచి ప్రయోజనాలు పొందుతారని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య దామోదర్ అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లోని ఆ యూనివర్సిటీలో 'రీసెంట్ ఇన్ అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్' అనే అంశంపై ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. విద్యార్థులు ముందు చూపుతో పరిశోధనలపై దృష్టి సారించాలని సూచించారు. అలాంటి వారికి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. అలాంటి విద్యార్థులకు తమ యూనివర్సిటీ చక్కటి వేదిక అని చెప్పారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో పరిశోధనలపై చర్చ జరుగుతుందని పేర్కొన్నారు. యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ సాత్వికరెడ్డి, ఆచార్య కేవీఆర్‌మూర్తి, గోపికృష్ణ, రాజు, పీఆర్వో గాదె రాంబాబు, అధ్యాపకులు, వివిధ శాఖాధిపతులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విశ్వకర్మ పథకంపై అవగాహన కల్పించాలి

● పరిశ్రమల శాఖ జిల్లా జీఎం వినయ్ కుమార్


మాట్లాడుతున్న వినయ్‌కుమార్

వికారాబాద్, ఫిబ్రవరి 15 : ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సీఎస్‌సీ కేంద్రాల ఆపరేటర్లు, గ్రామ పంచాయతీల కార్యదర్శులకు పరిశ్రమలశాఖ జిల్లా జనరల్ మేనేజర్ వినయ్ కుమార్ సూచించారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం ఎంఎస్‌ఎంఈ, జిల్లా పరిశ్రమల కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో పీఎం విశ్వకర్మ పథకంపై జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. లబ్ధిదారులు మీసేవ కేంద్రాలు, గ్రామపంచాయతీ కార్యాలయాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ కోసం ఆధార్‌కార్డు, మొబైల్ నెంబర్, బ్యాంకు వివరాలతో పాటు రేషన్‌కార్డు వంటి పత్రాలను సమర్పించాలని తెలిపారు. ఎంఎస్‌ఎంఈ ఏడీ సుధీర్ కుమార్, ఎస్‌బీఐ ఆర్‌ఎం (క్రెడిట్) వికాస్ సాహూ, ఎల్‌డీఎం రాంబాబు, మెప్మా పీడీ రవికుమార్, బీసీ సంక్షేమ శాఖ జిల్లా సహాయ అధికారి భీమ్ రాజు, సీఎస్‌సీ ఆపరేటర్లు, ఔత్సాహిక విశ్వకర్మలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అక్రమార్కులకు అండగా నిలిచిన బీఆర్ఎస్

● మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం, ఫిబ్రవరి 15 : చెరువుల సుందరీకరణ పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం అక్రమార్కులకు అండగా నిలిచిందన్నారు. వారికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాల ప్రణాళికలు తయారు చేసిందన్నారు. నియోజకవర్గం పరిధిలో సుందరీకరణపేరుతో కబ్జాలకు గురైన చెరువులు, కుంటలను త్వరలో రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పరిశీలిస్తారని తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ధరణిని అడ్డం పెట్టుకొని అడ్డగోలుగా ప్రభుత్వ భూములను బీఆర్ఎస్ పెద్దలకు అప్పజెప్పిన పలువురు అవినీతి అధికారులను వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. అదే విధంగా చెరువుల పరిరక్షణ సమితి సహా పర్యావరణ పరిరక్షణసభ్యులు, అఖిలపక్షం నాయకులు చెరువుల పునరుద్ధరణ కార్యక్రమానికి సహకరించాలని కేఎల్ఆర్ కోరారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేఎల్ఆర్

కాంగ్రెస్ కంచుకోటగా మహేశ్వరం

మహేశ్వరాన్ని కాంగ్రెస్ కంచుకోటగా చేసి పార్టీకి పూర్వ వైభవం తేవాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కార్యకర్తలను కోరారు. గురువారం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, మహిళా కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీలో చేరారు. నాయకులు చిగిరింత నర్సింహ్మారెడ్డి, ఏనుగుజంగారెడ్డి, సత్యనారాయణ, పద్మ, యాదయ్య పాల్గొన్నారు.



ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్ ప్రక్రియ పూర్తి

మేడ్చల్ ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గురువారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లాలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవల్ చెకింగ్ ప్రక్రియను కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పూర్తి చేశారు. ఈ నెల 5న ప్రారంభమైన ఈవీఎం, వీవీప్యాట్, బ్యాలెట్ బాక్స్ ఫస్ట్ లెవల్ చెకింగ్ ప్రక్రియ గురువారం నాటికి పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. 26 మంది ఈసీఎల్ ఇంజనీర్ల బృందం సహకారంతో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల మేరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను చెకింగ్ చేసినట్లు చెప్పారు. 14, 15 తేదీలలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించిన అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోడౌన్‌లో భద్రపరిచి సీల్ చేశామన్నారు. డీఆర్వో హరిప్రియ, తహసీల్దార్ రాజేశ్వర్‌రెడ్డి, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


గోడౌన్‌కు సీల్ వేస్తున్న అధికారులు

నేటి నుంచి అగ్రిటెక్ దక్షిణాది సదస్సు

వికారాబాద్, ఫిబ్రవరి 15 : భారతీయ పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) ఆధ్వర్యంలో తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నేటి నుంచి ఈనెల 18 వరకు రైతులకు అగ్రిటెక్ దక్షిణాది సదస్సు నిర్వహిస్తున్నట్లు వ్యవసాయశాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖ మంత్రి పాల్గొంటారని, వ్యవసాయరంగంలో వస్తున్న మార్పులు తదితర అంశాలపై ఈ సదస్సులో చర్చిస్తారని తెలిపారు.

ఐదేళ్ల పిల్లలకు పోలియో చుక్కలు


వికారాబాద్, ఫిబ్రవరి 15 : పుట్టిన శిశువు నుంచి ఐదు సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేయించి అంగవైకల్యం రాకుండా చూడాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి డాక్టర్ మురారి రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో 2024 పల్స్ పోలియోపై ఒకరోజు శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో హైరిస్క్ ప్రాంతాలను గుర్తించి అక్కడ ఉన్న పిల్లలకు కూడా పోలియో చుక్కలు వేయాలని, అలాగే బస్టాండ్ రైల్వేస్టేషన్‌లలో కూడా పోలియో చుక్కల కేంద్రాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ బుచ్చిబాబు, జిల్లా వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


శిక్షణలో పాల్గొన్న వైద్యాధికారులు

ఎస్ఐల బదిలీలు

వికారాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జిల్లాలో ఆరుగురు ఎస్ఐలను బదిలీ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి. కులకచర్ల ఎస్ఐగా పనిచేస్తున్న శ్రీశైలం బంట్వారంకు బదిలీ కాగా, వికారాబాద్ ఎస్ఐగా పనిచేస్తున్న అన్వేష్ కుమార్‌ను కులకచర్లకు బదిలీ చేశారు. బంట్వారం ఎస్ఐగా పనిచేస్తున్న ఆనంద్ కుమార్‌ను దోమకు బదిలీ చేయగా, దోమ ఎస్ఐ రవిని వీఆర్‌లో ఉంచారు. వీఆర్‌లో ఉన్న ఎం కాశీనాథ్‌ను, తాండూరు ఎస్ఐగా, జీవీ సత్యనారాయణను వికారాబాద్ ఎస్ఐగా బదిలీ చేశారు.





గనుల శాఖకు పెరిగిన ఆదాయం


ఎర్రమట్టి క్వారీ

తాండూరు, ఫిబ్రవరి 15 : సుద్ద, ఎర్రమట్టిపై రాయల్టీ రూపంలో గనుల శాఖకు ఈ ఏడాది రెట్టింపు ఆదాయం వచ్చింది. గతేడాది మార్చి నాటికి సుద్దపై రూ.2 కోట్ల 23లక్షల ఆదాయం రాగా, ఈ ఏడాది ఫిబ్రవరి 10 నాటికే రూ. 5 కోట్ల 52 లక్షల ఆదాయం సమకూరింది. గత ఏడాది ఎర్రమట్టిపై రూ. 51 కోట్ల 20 లక్షల ఆదాయం రాగా ఈసారి రూ. 57 కోట్ల 55 లక్షల ఆదాయం వచ్చింది. కంకరపై గత ఏడాది రూ. 3 కోట్ల 79 లక్షల ఆదాయం రాగా ఈ సంవత్సరం రూ. 3 కోట్ల71 లక్షల ఆదాయం సమకూరింది. సుద్ద, ఎర్రమట్టి తవ్వకాలు తరలింపుపై మైన్స్ శాఖ రాయల్టీ తప్పనిసరి నిబంధన పెట్టడంతో పాటు తనిఖీలు చేయడం, అక్రమాలకు కళ్లెం వేయడంతో ఆదాయం పెరిగింది.

ఈ ఏడాది లక్ష్యం రూ. 113 కోట్లు..

జిల్లాలో ఈ ఏడాది మైన్స్ శాఖ రూ.113 కోట్ల ఆదాయాన్ని పొందాలని లక్ష్యం పెట్టుకోగా ఇప్పటి వరకు రూ. 92 కోట్ల ఆదాయం వచ్చింది. మార్చి నాటికి లక్ష్యం చేరుతామని మైన్స్ ఏడీ జాకబ్ చెప్పారు. గతేడాది రూ. 88 కోట్ల 50 లక్షలు లక్ష్యం పెట్టుకోగా రూ.97 కోట్ల 39 లక్షల ఆదాయం వచ్చింది.

ఆదాయం తెస్తున్న ఖనిజ సంపద

ఎర్ర మట్టి 54 లీజులు, కంకర 24, సుద్ద 22, నాపరాయి 57, నల్లగ్రానైట్ 3, సున్నపురాయి 3, సిమెంట్ కర్మాగారాలు 7 లీజుల రాయల్టీ ద్వారాపై ఆదాయం వస్తోంది.



మాతాశిశు మరణాలపై సమీక్ష


సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో

మేడ్చల్ ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : వైద్యాధికారులతో డీఎంహెచ్‌వో రఘునాథ స్వామి తన కార్యాలయంలో గురువారం మాతా, శిశు మరణాలపై సమీక్ష నిర్వహించారు. పిల్లల మరణాలకు గల కారణాలలో భౌగోళిక వైవిధ్యాన్ని అర్థం చేసుకొని, ప్రసూతి సంరక్షణ చర్యలను మెరుగుపరచాలని ఆయన అన్నారు. అప్పుడే మాతా శిశు మరణాలను తగ్గించడం వీలవుతుందని చెప్పారు. వైద్యులు గీతాప్రసాద్, పద్మావతి, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్లు, జవహర్‌నగర్, కీసర, ఉప్పల్, దుండిగల్, జగద్గిరిగుట్ట వైద్యాధికారులు పాల్గొన్నారు.



మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో 5కే రన్


5కే రన్‌ను ప్రారంభిస్తున్న మల్లారెడ్డి

మేడ్చల్ ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గుండ్ల పోచంపల్లి మున్సిపల్ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్ ఆఫ్ ఉమెన్స్‌లో గురువారం నిర్వహించిన '5కే రన్ ఫర్ ఈక్వాలిటీ'ని ఎమ్మెల్యే మల్లారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి రన్‌లో పాల్గొన్నారు. అనంతరం మల్లారెడ్డి యూనివర్సిటీ, స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్‌లో బీఎస్సీ అగ్రికల్చర్ నాలుగవ సంవత్సరం చదువుతున్న 43 మంది విద్యార్థులు లెర్నింగ్ కోసం అమెరికా వెళుతున్న సందర్భంగా వారికి అభినందనలు తెలియజేశారు. ఇటీవల హాస్టల్‌లో ఆహారం నాణ్యంగా ఉండడంలేదని విద్యార్థులు ఆందోళన నిర్వహించడంతో ఉదయం విద్యార్థులతో కలిసి ఆయన హాస్టల్‌లోనే టిఫిన్ చేశారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దైవచింతనతోనే ప్రశాంతత


పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చేవెళ్ల, ఫిబ్రవరి 15 : దైవచింతనతోనే ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్స్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో పోచమ్మగుడి మూడవ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీంభరత్, సత్యనారాయణరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బండారు ఆగిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ సర్పంచ్ లొంక శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ కొత్తకాపు నర్సింహారెడ్డి, గ్రామస్థులు, ఉన్నారు.

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి

● ప్రజాప్రతినిధులు, నాయకులు
● ఘనంగా సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి

షాద్‌నగర్, ఫిబ్రవరి 15 : సమాజాన్ని చక్కదిద్దడానికి ఎందరో మహనీయులు భూమి మీద అవతరిస్తారని, ప్రతీఒక్కరు వారి ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని గురువారం షాద్‌నగర్ పట్టణంలో నిర్వహించిన ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బంజారా జాతిని సన్మార్గంలో నడిపించిన మహనీయుడు సేవాలాల్ అని కొనియాడారు. ఆర్డీవో వెంకట మాధవరావు, గిరిజన నేతలు రఘు, జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, నాయకులు యాదయ్య, చెంది తిరుపతిరెడ్డి తదితరులున్నారు.

మహేశ్వరం : బంజారాల ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనుభావుడు, గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ అడుగుజాడల్లో ప్రతీఒక్కరు నడుచుకోవాలని మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే



ఆమనగల్లు : సేవాలాల్ జయంతి వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, తదితరులు

సబితాఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరంలో జరిగిన సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యేలు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, తీగల కృష్ణారెడ్డి, ఎంపీపీ సునీతాఅంద్యానాయక్, మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి, సేవాలాల్ ఆలయ కమిటీ చైర్మన్ సీతారామ్, నాయకులు కూన యాదయ్య, ఈశ్వర్‌నాయక్, దేవ్లానాయక్, విఠల్‌నాయక్, రాజునాయక్, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : గిరిజన సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని, ఇందిరమ్మ పాలనలోనే గిరిజనులకు పోడు భూములు ఇస్తే.. మాజీ సీఎం కేసీఆర్ వాటిని కొల్లగొట్టారని మాజీ ఎమ్మెల్యేలు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, తీగల కృష్ణారెడ్డిలు అన్నారు. సేవాలాల్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్‌ల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన భారీ ర్యాలీలో పీసీసీ సభ్యుడు జంగారెడ్డితో కలిసి వారు పాల్గొన్నారు. అనంతరం సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేశారు. తహసీల్దార్ గోపాల్, ఎంపీడీవో సరిత, సేవాలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురాం రాథోడ్, ఉపాధ్యక్షులు భీంలాల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజునాయక్, దేవ్‌సింగ్‌నాయక్, ఎస్.కృష్ణానాయక్, మాణిక్యం నాయక్, గోవర్ధన్‌నాయక్, జయేందర్‌నాయక్, తదితరులున్నారు.



షాద్‌నగర్ : సేవాలాల్ జయంతి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఆమనగల్లు : సేవాలాల్ 285వ జయంతి వేడుకలు ఆమనగల్లు పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో గిరిజనులు అట్టహాసంగా జరుపుకున్నారు. గిరిజన ప్రజా ప్రతినిధులు, నాయకులు, యువకులు వేడుకల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆమనగల్లు మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ రాంపాల్ నాయక్ అధ్యక్షతన జయంతి వేడుకలు నిర్వహించారు. వైస్ చైర్మన్ దుర్గయ్య, కమిషనర్ శ్యామ్‌సుందర్, కౌన్సిలర్లు, నాయకులు సుందూరు ఝాన్సీశేఖర్, కృష్ణ, లక్ష్మణ్, కృష్ణనాయక్, తదితరులున్నారు. ఆమనగల్లు పట్టణంలోని సేవాలాల్ ఘాట్ వద్ద నిర్వహించిన వేడుకలకు మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్ హాజరయ్యారు. సేవాలాల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జడ్పీటీసీ అనురాధపత్యానాయక్, ఎంపీటీసీ సరిత పంతూనాయక్, నాయకులు సోన శ్రీను నాయక్, శోభచందునాయక్, గన్యానాయక్, రమేశ్ నాయక్, తదితరులున్నారు. కడ్తాల మండల కేంద్రంతో పాటు మైసిగండిలో జయంతి వేడుకలు నిర్వహించారు. సేవాలాల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మైసిగండిలో భారీ శోభయాత్ర నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జడ్పీటీసీ దశరథ్‌నాయక్, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, నాయకులు తదితరులున్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి పూజలు చేపట్టారు. గోపాల్ నాయక్, లక్ష్మణ్‌నాయక్, ఈశ్వర్ నాయక్, దేవుల నాయక్, విజేందర్, కృష్ణ, సాయి, శ్రీరామ్, మోత్య, నవీన్ తదితరులున్నారు.

మాడ్గుల : మండలంలోని తండాలలో గిరిజనులు సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలో, కొర్రతండా, కాంట్రామ్ తండా, జర్పుల తండాలో జయంతిని ఘనంగా నిర్వహించారు. వైస్ ఎంపీపీ కొర్ర శంకర్‌నాయక్, మాజీ ఎంపీపీ జైపాల్‌నాయక్, చందర్‌నాయక్, వసూరాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం : ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సవితాఇంద్రారెడ్డి, తదితరులు

శంషాబాద్ : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో సేవాలాల్ కమిటీ సభ్యులు ర్యాలీ నిర్వహించారు. సేవాలాల్ సేవలను కొనియాడుతూ నినాదాలు చేశారు. సేవాలాల్ కమిటీ సభ్యులు అంగూర్‌నాయక్‌తో పాటు పలువురు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

షాబాద్ : సేవాలాల్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఎస్టీసెల్ మండలాధ్యక్షుడు గోపాల్‌నాయక్ అన్నారు. దూసరికుంట తండాలో సేవాలాల్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆయన్ను ప్రతీఒక్కరు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు.

యాచారం : మండలంలోని మంతన్‌గౌరెల్లి, తక్కళ్లపల్లితండా, తదితర తండాల్లో సేవాలాల్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. సేవాలాల్ ఆలయాల్లో పూజలు చేశారు. పలు చోట్ల చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. తక్కళ్లపల్లి తండా నుంచి యాచారం మండల కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. నాయకులు అరవింద్‌నాయక్, గణేష్‌నాయక్, విజయ్‌రాథోడ్‌లు తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ రూరల్ : గిరిజన జాతి ఔన్నత్యాన్ని పెంచిన గొప్ప దార్శనికుడు సంత్ సేవాలాల్ మహరాజ్ అని బీసీ సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మద్దూరి అశోక్‌గౌడ్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం చౌడమ్మగుట్టతాండలో నిర్వహించిన జయంతి వేడుకలో ఆయన పాల్గొన్నారు. పూజా కార్యక్రమంలో తండా వాసులు తదితరులు పాల్గొన్నారు.

చౌదరిగూడ : బంజారా జాతికి వన్నె తెచ్చిన మహనీయుడు సేవాలాల్ అని తహసీల్దార్ జగదీష్ అన్నారు. మండల కేంద్రంలో సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీటీసీలు అంబ్రమ్మ గోబిర్యా నాయక్, సత్యనారాయణరెడ్డి, రజిత, గోబ్రోనాయక్, పి.రమేష్, వి.రాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూర్ : మున్సిపాలిటీతో పాటు, మండలంలోని ఆయా తండాల్లో సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను గిరిజనులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మున్సిపాలిటీలోని కొత్తూర్ తండా, మండలంలోని మల్లాపూర్ తండాల్లో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని సేవాలాల్ ఆలయాల్లో పూజలు చేశారు. తండాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తూర్ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, కౌన్సిలర్ సోమ్లనాయక్, నాయకులు రవినాయక్, గోవింద్‌నాయక్, ఇందూరి శ్రీనివాస్, అంబటి ప్రభాకర్, రాందాస్‌నాయక్ తదితరులున్నారు.



కందుకూరు : ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు కేఎల్లార్, కృష్ణారెడ్డి, పీసీసీ మెంబర్ జంగారెడ్డి

కొందుర్గు : యువత అహింసా మార్గంలో పయనించాలని మాజీ వైస్ ఎంపీపీ మంగులాల్ నాయక్ అన్నారు. అయోధ్యాపూర్ తండాలో సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగులాల్ మాట్లాడుతూ ప్రతీ మండల కేంద్రంలో సేవాలాల్ గుడి నిర్మాణం చేయాలని కోరారు. రెడ్యానాయక్, గోపాల్ నాయక్, పాండు నాయక్, కిషన్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, రాజు నాయక్, తౌర్యా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట : ప్రతీ ఒక్కరు సేవాలాల్ అడుగు జాడల్లో నడవాలని ఎంపీపీ రవీందర్ యాదవ్, జడ్పీటీసీ విశాలశ్రవణ్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలో



యాచారం : మంతన్‌గౌరెల్లిలో సేవాలాల్ చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

సంత్ సేవాలాల్ కమిటీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోగ్ చేసి భక్తులకు పంచిపెట్టారు. అంతకుముందు ఎంపీపీ, జడ్పీటీసీలు సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. కమిటీ అధ్యక్షుడు రూప్లానాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేశ్, ప్రధాన కార్యదర్శి గిరిధర్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, రాజు నాయక్, నారాయణ నాయక్, వీరేందర్, దాసు నాయక్, జగన్ నాయక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, యెన్నం శ్రీధర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, గోపాల్‌ముదిరాజ్ తదితరులున్నారు.



శంషాబాద్ : సేవాలాల్ జయంతి సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు





కేశంపేట/షాబాద్ : జయంత్యుత్సవాల్లో ఎంపీపీ రవీందర్ యాదవ్, గోపాల్‌నాయక్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

● షాబాద్ నూతన తహసీల్దార్ ఎండీ అన్వర్



షాబాద్, ఫిబ్రవరి 15 : ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని షాబాద్ నూతన తహసీల్దార్ మహ్మద్ అన్వర్ అన్నారు. ఈమేరకు ఆయన గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఇక్కడ విధులు నిర్వహించిన చిన్నప్పలనాయుడు సూర్యాపేట ఆర్డీవో ఆఫీసుకు బదిలీపై వెళ్లారు. ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న అన్వర్ షాబాద్‌కు బదిలీపై వచ్చారు.


కడ్తాల్ ఎంపీడీవోకు సన్మానం



సుజాతను సన్మానిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, ఫిబ్రవరి 15: కడ్తాల నూతన ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన సుజాత నాయక్‌ను గురువారం డీసీసీ అధికార ప్రతినిధి, ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సత్కరించారు. గురిగళ్ల లక్ష్మయ్య, జహంగీర్ అలీ, వెంకటేష్, తదితరులున్నారు.

మాడ్గుల ఏఎస్సై బాల్‌సింగ్ నాయక్‌కు..



మాడ్గుల : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల ఏఎస్సైగా పదోన్నతి పొందిన బాల్‌సింగ్ నాయక్‌ను మాజీ ఎంపీపీ అన్నేపాక జంగయ్య, నాయకులు జడల అంజయ్య, భాస్కర్, ప్రవీణ్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించారు.

కొత్తూర్ తహసీల్దార్, ఎంపీడీవోలకు..



కొత్తూర్ : నూతనంగా పదవీ బాధ్యతను స్వీకరించిన తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఎంపీడీవో ఆరుంధతిలను గురువారం స్థానిక ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో కొడిచర్ల ఎంపీటీసీ బి.రవీందర్‌రెడ్డి, ఎంపీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పని తీరుతోనే ప్రజల్లో కీర్తి

ఆమనగల్లు, ఫిబ్రవరి 15: పనితీరును బట్టే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజల్లో కీర్తి లభిస్తుందని మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్ అన్నారు. ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్‌గా నాలుగేళ్లు పనిచేసి నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు బదిలీ అయిన శ్యామ్‌సుందర్‌ను గురువారం నిర్వహించారు. వైస్‌చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు, నాయకులతో సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. కౌన్సిలర్లు, నాయకులు తల్లోజు విజయ్ కృష్ణ, చెక్కాల లక్ష్మణ్, సుజాత రాములు, కృష్ణ, గోరటి జ్యోతిన నర్సింహ, సుందూరు ఝాన్సీశేఖర్, చెన్నకేశవులు, కృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శ్యామ్‌సుందర్‌ను సన్మానిస్తున్న పాలక వర్గం

ప్రజాపాలనలో అన్ని వర్గాలకు మేలు : కసిరెడ్డి

ఆమనగల్లు, ఫిబ్రవరి 15 : కాంగ్రెస్ ప్రజాపాలనలో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఈజీఎస్ నిధులతో చేపట్టే సీసీ రోడ్ల నిర్మాణంపై గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే అధికారులతో సమావేశం నిర్వహించారు. మంజూరైన రోడ్లను త్వరితగతిన పూర్తి చేసేలా చొరవ తీసుకోవాలని సూచించారు. ఈజీఎస్ పథకం ద్వారా కల్వకుర్తి నియోజకవర్గంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కడ్తాల మండలం ముద్విన్ గ్రామానికి ఈజీఎస్ ద్వారా రూ.15 లక్షలు మంజూరు చేసిన ఎమ్మెల్యేని స్థానిక మాజీ సర్పంచ్ ఈర్లపల్లి యాదయ్య, మాజీ ఎంపీటీసీ బెల్లంకొండ యాదయ్యల ఆధ్వర్యంలో సత్కరించి అభినందించారు. రోడ్ల నిర్మాణానికి మరో రూ.30 లక్షలు మంజూరు చేయాలని వారు వినతి పత్రం అందజేశారు. నక్కపోతు నర్సింహ, పట్నం పరమేష్, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, దశరథ్ రెడ్డి, నర్సింహ, సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ముద్విన్ గ్రామస్తులు

ఘనంగా ధర్మభిక్షం జయంతి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 15: సీనియర్ కమ్యూనిస్టు నేత, మాజీ పార్లమెంట్ సభ్యుడు బొమ్మగాని ధర్మభిక్షం 102వ జయంతిని గురువారం ఇబ్రహీంపట్నంలో ఘనంగా నిర్వహించారు. చెరువు కట్టపై ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గీతపనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.రాములుగౌడ్, గౌడ సంఘం నాయకులు తాళ్ల మహేష్‌గౌడ్, శ్రీశైలంగౌడ్, యాదయ్యగౌడ్, నిరంజన్‌గౌడ్ తదితరులున్నారు.



నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

గ్రామాలను శుభ్రంగా తీర్చిదిద్దాలి



యాచారం : కార్మికులను సన్మానిస్తున్న ఎంపీపీ సుకన్య, ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

యాచారం, ఫిబ్రవరి 15 : గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని, తడి, పొడి చెత్తను వేర్వేరు బుట్టల్లో వేయించి డంపింగ్ యార్డులకు చేర్చాలని ఎంపీపీ సుకన్యబాషా అన్నారు. గురువారం నిర్వహించిన యాచారం గ్రామసభలో ఎంపీపీ మాట్లాడుతూ తాగునీరు కలుషితం కాకుండా చూడాలని వాటర్‌మెన్‌ను ఆదేశించారు. అనుమతి లేకుండా ఇళ్ల నిర్మాణం చేపట్టొద్దని సూచించారు. ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, కార్యదర్శి తిరుపతి తదితరులున్నారు. చిన్నతూండ్ల, ధర్మన్నగూడ తదితర గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి పలు అభివృద్ధి పనులకు సంబంధించిన తీర్మానాలు చేశారు. అలాగే ఇబ్రహీంపట్నం మండలంలోని గ్రామ పంచాయతీల్లో చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం గురువారం ముగిసింది. గ్రామాల్లో ప్రత్యేకాధికారులు పంచాయతీ కార్మికులను ఘనంగా సన్మానించారు. ఉప్పరిగూడ, పోచారంలలో ప్రత్యేకాధికారి ఏఈ గుర్రం ఇంద్రసేనారెడ్డి కార్మికులను సన్మానించారు.

'మల్లు'కు ఎంపీ టికెట్ ఇవ్వాలి

ఆమనగల్లు, ఫిబ్రవరి 15: కాంగ్రెస్ పార్టీకి మూడున్నర దశాబ్దాలుగా పీసీసీ ఉపాధ్యక్షుడు, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లు రవి అందించిన సేవలను పార్టీ అధిష్ఠానం గుర్తించి ఎంపీ టికెట్ ఇవ్వాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుర్రం కేశవులు అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాన్ని మల్లు రవికి కేటాయించాలని కోరారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం మాజీ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మండ్లీ రాములు, మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్యలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మల్లు కుటుంబం కాంగ్రెస్ పార్టీకి దశాబ్దాలుగా సేవలందిస్తోందని, 2009, 2014లో అధిష్ఠానం నిర్ణయం మేరకు రవి ఎంపీ టికెట్ త్యాగం చేశారన్నారు.

పోకిరీలతో అప్రమత్తంగా ఉండాలి

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 15: పోకిరీలతో జాగ్రత్తగా ఉండాలని షీటీమ్ బృందం సభ్యులు విద్యార్థినులకు సూచించారు. శంషాబాద్ షీ టీమ్ బృందం సభ్యులు ఏఎస్సై గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ ఉన్నత పాఠశాలలో ఈవ్ టీజింగ్‌పై అవగాహన కల్పించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి చెప్పారు. పోకిరీల నుంచి వేధింపులు ఎదురైనప్పుడు షీటీమ్‌ను సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా పాఠశాలలో సంత్ సేవాలాల్ జయంతిని జరుపుకున్నారు. ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్ విజయలక్ష్మి, కృష్ణయ్య, బృందం సభ్యులు బుచ్చయ్య ప్రహ్లాద్, రేష్మా, భార్గవి తదితరులు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న షీటీమ్ సభ్యులు

కొనసాగుతున్న వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

కడ్తాల్ : మక్తమాదారం వేణుగోపాల స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. ఆలయ ధర్మకర్త వింజమూరి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటున్నారు. రెండోరోజు గురువారం నిత్యనిధి, బలిహరణం, గరుడసేవ, మోహిని సేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి పల్లకి సేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వేంకటేశ్వరాలయంలో నేడు రథసప్తమి వేడుకలు

చేవెళ్ల, ఫిబ్రవరి 15 : నేడు(శుక్రవారం) మండల కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో రథ సప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌చారి, శ్రీపాదు, ఈవో నరేందర్ గురువారం తెలిపారు. రథసప్తమి సందర్భంగా ఆలయంలో సాయంత్రం 4 గంటలకు సప్తవాహన సేవ నిర్వహిస్తామని, స్వామివారు భక్తులకు దర్శనం ఇస్తారని చెప్పారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని వారు కోరారు.

పదో తరగతి ఇంటర్నల్ మార్కుల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

షాద్‌నగర్, ఫిబ్రవరి 15 : జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు గురువారం ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న పదోతరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులను గెజిటెడ్ హెడ్ మాస్టర్ రసూల్, స్కూల్ అసిస్టెంట్ గణేష్, రమేష్ పరిశీలించారు. పట్టణంలోని అబ్యాస్ పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన పరీక్షల రికార్డులు, వారికి వేసిన మార్కులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ పదో తరగతిలో ఇంటర్నల్స్‌లో 20 మార్కులు ఉంటాయని తెలిపారు. విద్యార్థుల రికార్డులకు వేసిన మార్కులు సక్రమంగా ఉన్నాయా? లేవా? అనే విషయాన్ని గుర్తించేందుకు ప్రైవేటు పాఠశాలల్లో రికార్డులను పరిశీలిస్తున్నామని చెప్పారు.

మండల సమావేశం వాయిదా

కొత్తూర్, ఫిబ్రవరి 15: మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. గురువారం కొత్తూర్ మండల సమావేశం జరుగనుండగా సమావేశానికి ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి మాత్రమే హాజరుకాగా, మిగతా సభ్యులు గైర్హాజయ్యారు. దాంతో కోరం సభ్యులు లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో ఆరుంధతి ప్రకటించారు. త్వరలో తేదీ ప్రకటిస్తామని ఎంపీడీవో చెప్పారు.

సంక్షిప్తంగా..

● **కడ్తాల్ :** రాబోవు వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటిని వృథా చేయకుండ పొదుపుగా వాడుకోవాలని ఎంపీడీవో సుజాత నాయక్ కోరారు. కడ్తాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో సుజాత నాయక్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్ పాల్గొన్నారు. వార్డుల వారీగా పారిశుధ్య కార్యక్రమాల నిర్వాహణ, అభివృద్ధి కార్యక్రమాలు, తాగునీటి సరఫరాపై చర్చించారు. కార్యదర్శి రాఘవేందర్, నాయకులు ఆశకార్యకర్తలు, మహిళా సంఘం సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● **కేశంపేట :** కాకునూర్‌కు చెందిన సొంటే శ్రీనివాస్ కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్(సీసీఆర్) జిల్లా ప్రతినిధిగా నియమించబడ్డారు. సీసీఆర్ జిల్లా ఇన్‌చార్జి అశోక్‌కుమార్ హైదరాబాద్‌లోని కార్యాలయంలో గురువారం నియామకపత్రం అందించారు.

● **తలకొండపల్లి :** మండలంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.2.85 కోట్లు మంజూరైనట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి చెప్పారు. మండల కేంద్రంలో పీసీసీ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డిలతో కలిసి విలేకరుల సమావేశంలో ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు.

● **కడ్తాల్ :** హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి గౌడ కులస్థులు ఐక్యంగా ముందుకు సాగాలని గౌడ సంఘం మండలాధ్యక్షుడు మాలే మల్లేశ్ గౌడ్, గౌరవాధ్యక్షుడు యాదయ్యగౌడ్‌లు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని కాటమయ్య దేవాలయం ఆవరణలో గౌడ సంఘం సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చించి తీర్మానాలు చేశారు.

క్రైం కార్నర్

ఉరేసుకొని ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ ఆత్మహత్య

యాచారం, ఫిబ్రవరి 15 : ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ అద్దె బస్సు నడుపుతున్న ఓ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గున్‌గల్ గ్రామానికి చెందిన అండాలు, జంగయ్య దంపతుల ఏకైక కుమారుడు శశి(23) ఇబ్రహీంపట్నం డిపోలో ఆర్టీసీ అద్దె బస్సు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం బంధువుల ఇంట్లో జరిగిన వివాహానికి హాజరై సాయంత్రం మిత్రులతో సరదాగా కాలం గడిపాడు. రాత్రి ఇంటికి చేరుకున్నాక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం తల్లిదండ్రులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కాగా, ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ చేస్తున్నట్లు యాచారం పోలీసులు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్‌కుమార్ తెలిపారు. కాగా, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో వలస కూలీ..

షాబాద్, ఫిబ్రవరి 15 : ఉరేసుకొని వలస కూలీ మృతిచెందిన ఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ యాదయ్యగౌడ్ తెలిపిన వివరాల మేరకు.. మధ్యప్రదేశ్‌లోని చత్తాపూర్‌నకు చెందిన రతికుశ్వ కుమారుడు రంజిత్‌కుశ్వ, కూతురు సీతాకుశ్వలు బతుకుదెరువు నిమిత్తం కొంత కాలం క్రితం చందన్‌వెళ్లికి వలసవచ్చారు. కుందనా టెక్స్‌టైల్స్ పరిశ్రమల్లో పనిచేస్తున్నారు. రెండు, మూడు రోజులుగా సీత(20) అనారోగ్యంతో బాధపడుతోంది. తల్లి, సోదరుడు పనులకు వెళ్తే ఆమె ఇంటివద్దనే ఉంటోంది. గురువారం రతికుశ్వ ఇంటికి వచ్చేసరికి సీత రేకులషెడ్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కాగా, ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. అనారోగ్యం కారణంగా ఆత్మహత్య చేసుకుందేమోనని కుటుంబసభ్యులు అనుమానిస్తున్నారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొందుర్గు, ఫిబ్రవరి 15: రోడ్డు ప్రమాదంతో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ కథనం మేరకు.. చౌదరిగూడ గ్రామానికి చెందిన ఎండీ జహంగీర్(61) బుధవారం రాంచంద్రాపూర్ సంతలో కూరగాయలు విక్రయించేందుకు వెళ్లాడు. అనంతరం టీవీఎస్ టూనాపై రాత్రి చౌదరిగూడెంకు బయలుదేరగా మార్గమధ్యలో కొందుర్గు మండల కేంద్రం శివారులో స్కాన్ ఐరన్ పరిశ్రమ మూలమలుపు వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొంది. దాంతో జహంగీర్ తలకు బలమైన గాయమైంది. స్థానికులు చికిత్స నిమిత్తం కొందుర్గు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి 12 గంటల సమయంలో మృతిచెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. మృతుడి కుమారుడు ఆజ్మీర్ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కారు బోల్తా.. వ్యక్తికి తీవ్ర గాయాలు

నందిగామ, ఫిబ్రవరి 15: నందిగామ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చంద్రాయన్‌గూడ సమీపంలో పాత జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి బోల్తాపడడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. షాద్‌నగర్‌కు చెందిన వజీర్ తన కారులో షాద్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా మార్గమధ్యలో కారు అదుపుతప్పి చంద్రాయన్‌గూడ సమీపంలోని పాత జాతీయ రహదారిపై బోల్తాపడింది. ప్రమాదంలో వజీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో కారులో వజీర్ ఒక్కడే ఉన్నాడు. స్థానికులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి అతివేగమే కారణమని పోలీసులు ప్రాథమిక విచారణలో తేల్చారు.

చోరీ నిందితుల అరెస్టు.. ఆభరణాలు, నగదు స్వాధీనం

కొత్తూర్, ఫిబ్రవరి 15: రెండు రోజుల క్రితం స్థానిక మున్సిపాలిటీలోని భవానీ నగర్‌లో గల మందోని మైసమ్మ ఆలయంలో చోరీకి పాల్పడిన నిందితులను స్థానిక పోలీసులు అరెస్ట్‌చేసి నగదుతో పాటు, బంగారు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు వివరాలు వెల్లడించారు. కొత్తూర్‌లో నివాసముంటున్న బీహార్‌కు చెందిన రాహుల్‌సింగ్, మహారాష్ట్రకు చెందిన శానిదేవ్ సాలుంకే, నందిగామ మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన ముప్పల మహేందర్‌లు గ్రూప్‌గా ఏర్పడి ఈనెల 12న అర్ధరాత్రి మందోనిమైసమ్మ ఆలయం తలుపులు బద్దలుకొట్టి లోపలికి ప్రవేశించి హుండీలో ఉన్న రూ.22,500 నగదుతో పాటు, రూ.2లక్షల విలువచేసే బంగారు, వెండి వస్తువులను దోచుకుని పరారయ్యారు. గురువారం ఉదయం తిమ్మాపూర్ సమీపంలోని 44వ నెంబర్ జాతీయ రహదారి పక్కన అనుమానాస్పదంగా తిరుగుతున్న ఆ ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కేసును ఛేదించిన ఎస్సై జి.శ్రీనివాస్, ఏఎస్ఐ అబ్దుల్లా, కానిస్టేబుళ్లు కుమార్, సాయి రాం, రవీందర్‌నాయక్‌లను ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు అభినందించారు.


'మేడారం జాతర స్పెషల్ ఆపరేషన్'ను విజయవంతం చేయండి



సన్మానం పొందిన ఉద్యోగులతో డిప్యూటీ ఆర్ఎం జగన్

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 15 : ఈనెల 19 నుంచి మేడారం జాతర జరుగబోతున్న సందర్భంగా నిర్వహించనున్న స్పెషల్ ఆపరేషన్‌ను జయప్రదం చేయాలని ఆర్టీసీ హయత్‌నగర్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ జి.జగన్ అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నంలో జనవరి మాసం ప్రగతి రథ చక్ర పురస్కారాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎక్కువ ఈపీకే తెచ్చిన కండక్టర్లు, ఎక్కువ కేఎంపీఎల్ తెచ్చిన డ్రైవర్లకు అవార్డులిచ్చి అభినందించారు. ఇబ్రహీంపట్నం డీఎం బి.వెంకటనర్సప్ప, అసిస్టెంట్ డీఎం జి.సరస్వతి, ఏఈఎం సత్తయ్య, సూపర్‌వైజర్లు ఉన్నారు.


ఘనంగా మహేందర్ జన్మదిన వేడుకలు



బొల్లు మహేందర్‌ను సన్మానిస్తున్న నాయకులు, తదితరులు

ఆమనగల్లు, ఫిబ్రవరి 15: తెలంగాణ మానవ హక్కుల సంఘం చైర్మన్, బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బొల్లు మహేందర్ జన్మదిన వేడుకలు గురువారం విఠాయిపల్లి బీఎన్ఆర్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల నేతలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వారితో కలిసి మహేందర్ కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. పలుచోట్ల మొక్కలు నాటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మహేందర్‌ను పలువురు సత్కరించి అభినందించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. విజయ్, విష్ణు, శ్రీను, సర్వరాజు, రాందాస్, నరేందర్, రవిరాథోడ్, జాన్ ప్రతాప్‌రెడ్డి, నవీన్, కృష్ణయ్య, విజయభాస్కర్, మోహన్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలాలను కాపాడాలి



వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్ అశోక్‌కుమార్

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 15 : గ్రామ పంచాయతీ మున్సిపాలిటీకి కేటాయించిన లేఅవుట్‌లోని పార్కు స్థలాలను కాపాడాలని ఫత్తేపూర్ వార్డు కౌన్సిలర్, శంకర్‌పల్లి మాజీ ఎంపీటీసీ బీసోళ్ల అశోక్ కుమార్ కోరారు. ఈమేరకు గురువారం శంకర్‌పల్లి కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీగా ఉన్నప్పటి నుంచి పంచాయతీకి, మున్సిపాలిటీకి కేటాయించిన పార్కు స్థలాలు కొందరు అక్రమార్కులు కబ్జా చేయడంతో కాలనీవాసుల పిల్లలు ఆడుకోవడానికి, యువకులు వ్యాయామం చేయడానికి స్థలం లేకుండా ఇబ్బందిగా మారిందని తెలిపారు.